క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

వైరా: వైరా మున్సిపాలిటీ పాత తండాలో ఈ నెల 25 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మోహన్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు భాను ప్రకాశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్య నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను చత్రపతి శివాజీ జన్మ దినాన్ని పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యం లో నిర్వహించబడుతుందని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రధమ బహుమతి రూ.30,016లు , ద్వితీయ రూ.20,016 లు, తృతీయ బహుమతి రూ.10,016లు ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు, ఎంట్రీలు పంపడానికి నరేష్ నంబర్ 9989534860, నాగరాజు నంబర్ 9100836436 లను సంప్రదించాలని తెలిపారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వేంసూరు: మండలంలోని కందుకూరులో కొలువుదీరియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా మార్చి05 నుంచి 8 వరకు నిర్వహించనున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పురుషుల కబడ్డీ పోటీలకు బుధవారం గొర్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాయల సత్యానారాయణ, సర్పంచ్ బూరుగు నాగేశ్వరరావు, ఎంపీటీసీ భూలక్ష్మి, బండి ఉపేంద్రరెడ్డి, తుమ్మూరు వెంకటరెడ్డి, చిన్నపుల్లారెడ్డి, జుబ్బూరు నాగరాజు, తెలగారపు అప్పారావు పాల్గొన్నారు.

మండలంలో జెడ్పీ చైర్మన్ పర్యటన

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు, మాముునూరు, వెంకటాపురం, నారాయణపురం గ్రామాల్లో బుధవారం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పర్యటించారు. గ్రామాల్లోని పలువురి వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయా గ్రామాల్లోని కార్యకర్తలు, నాయకులతో కొంత సేపు మాట్లాడారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పంబి సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కారేపల్లిలో మాజీ ఎమ్మెల్యే..

కారేపల్లి: మండలంలోని మాధారం, గేటుకారేపల్లి గ్రామాల్లో వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ బుధవారం పర్యటించారు. మాధారం గ్రామంలో పాయం మునీందర్ ఇంట్లో శుభకార్యానికి హాజరు కాగా, అదే గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు బండ్ల వెంకన్న అనారోగ్యానికి గురికావటంతో ఆయన్ని పరామర్శించారు. అనంతరం గేటుకారేపల్లిలో రైతుబంధు మండల మాజీ కన్వీనర్ హన్మకొండ రమేష్ తల్లి ప్రభావతి ఇటీవల మృతి చెందటంతో.. వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ జగన్, మాజీ జెడ్పీటీసీ వీరేందర్, నాయకులు వెంకటేశ్వర్లు, రమేష్, గౌసుద్దీన్, ప్రభాకర్, రవి, వెంకటేశ్వర్లు, చందూ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

సత్తుపల్లి: ప్రైవేట్ టీచర్లకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే స్పందించి త్వరలోనే అర్హులైన ప్రతి ప్రైవేట్ టీచర్లకు నూతన గృహాలను మంజూరు చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రైవేట్ టీచర్ల జిల్లా అధ్యక్షుడు, డివిజన్ అధ్యక్షుడు, మండల అధ్యక్షుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారావు, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు గోపాలరావు, డివిజన్ ఉపాధ్యక్షుడు మురళీ, డివిజన్ కార్యదర్శి అంజయ్య, వంశీ, జిల్లా సలహాదారు గజ్వేల్ ఏసుబాబు, రవి, సతీష్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కల్పతరురోడ్‌లోని విశ్వజ్ఞానపీఠం వీధిలో రూ.5 లక్షలతో చేపట్టే సీసీరోడ్డు పనులకు మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్ మేకల భవాని బుధవారం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గాంధీనగర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అద్దంకి అనీల్, గుండ్ర రాఘవేందర్, నరుకుళ్ల శ్రీనివాసరావు, మేకల నర్సింహారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, లక్ష్మణరావు, మధు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో సర్పంచ్‌లు

- ఆరు నెలలుగా జీపీలకు జమకాని నిధులు
- మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు బంద్
- విద్యుత్ బిల్లులు సైతం చెల్లించలేక సర్పంచ్‌ల ఇక్కట్లు



మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సర్పంచ్‌లు (ఫైల్)



బోనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

బోనకల్: రాష్ట్రప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పులు తెచ్చి పారిశుద్య పనులు చేయించడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలుగా, కేంద్ర భుత్వం తొమ్మిది నెలలుగా నిధులు జమ చేయకపోవడంతో అభివృద్ధి పనులు చేయలేక పోతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంచాయతీలకు కేంద్రం మంజూరు చేసే ఎఫ్ఎఫ్‌సీ నిధులకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులు జమ చేసేవి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిధులను నిలిపేయగా, ఖాతాల్లో ఉన్న నిధులపై రాష్ట్రప్రభుత్వం ఫ్రీజింగ్ విధించడంతో గ్రామపంచాయతీల అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగడి అన్న చందాన ఉంది.

తగ్గించినా.. ఇవ్వక

రాష్ట్రంతో సంబంధం లేకుండా తామే స్వయంగా పంచాయతీలకు ఎఫ్ఎఫ్‌సీ నిధులు జమ చేస్తామని కేంద్రప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఇందు కోసం గాను కొత్త ఖాతాలు సైతం తెరిపించింది. గతంలో పంచాయతీల్లో జనాభా ఆధారంగా తలసరి రూ.120 చొప్పున జమ చేసేవారు. ప్రస్తుతం దీనిని రూ.115కు తగ్గించి ఇస్తున్నా.. కొన్ని నెలలుగా అదీ నిలిపేశారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం జూలై నుంచి నిధులు జమ చేయడం లేదని సర్పంచ్‌లు లబోదిబోమంటున్నారు. అలాగే, గ్రామపంచాయతీల ఆధ్వర్యాన చేపట్టిన పనులకు సంబంధించి చెక్కులను ట్రెజరీకి పంపించినా విడుదల కాక.. కొత్త పనులు చేయలేకపోతున్నామని సర్పంచ్‌లు వాపోతున్నారు.

రూ.5లక్షల నుంచి రూ.15లక్షలు

పెండింగ్ బిల్లులు, బకాయిలను పరిశీలిస్తే ఒక్కో గ్రామపంచాయతీకి స్థాయి ఆధారంగా రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు విడుదల కావాల్సి ఉందని సర్పంచ్‌లు చెబుతున్నారు. ఈ విషయం తెలిసినా మండల అధికారులు మాత్రం కొత్త పనులు చేయాలంటూ తమపై ఒత్తిడి తెస్తున్నారని సర్పంచ్‌ల ద్వారా తెలుస్తోంది. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నా సకాలంలో బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల సంగతి ఇలా ఉంటే... గ్రామాల్లోనూ ఇంటి పన్నులు పూర్తి స్థాయిలో వసూలు కాక... కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులకు ఇబ్బంది ఎదురవుతోందంటూ ఇటీవల సర్పంచ్‌లు మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు, నీటి సరఫరా చేసే ట్రాక్టర్ల డీజిల్ కొనుగోలు చేయలేక పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పంచాయతీలకు నిధులు విడుదల చేసి తమను ఆదుకోవాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

అప్పుల పాలవుతున్నాం..



అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తుండగా, నెలలు తరబడి నిధులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు పనులు చేయాలని ఒత్తిడి చేస్తుండడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. మా గ్రామంలో చేసిన పనులకు రూ.12 లక్షలు రావాలి. ప్రభుత్వాలు ఇకనైనా నిధులు విడుదల చేయాలి.

– ములకారపు రవి, సర్పంచ్, చిరునోముల

విద్యుత్ బిల్లుల కోసం ఒత్తిడి..



గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. జనరల్ ఫండ్ నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేయడం సరికాదు. మేం చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వానికి చెల్లించేవాటిని మాత్రం ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. మా జీపీకి రూ.8 లక్షలు రావాల్సి ఉంది.

– బాగం శ్రీనివాసరావు, సర్పంచ్, గోవిందాపురం (ఏ)

జీతాలు ఇవ్వలేక పోతున్నాం..



గ్రామంలో మల్టీపర్పస్ వర్కర్లకు కూడా జీతాలు ఇవ్వలేక పోతున్నాం. ట్రాక్టర్ డీజిల్ లేక చెత్త సేకరణ నిలిచిపోయింది. దీంతో పారిశుద్ధ్య సమస్య ఎదురవుతోంది. మా గ్రామానికి రూ.10 లక్షలు నిధులు రావాల్సి ఉంది. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయినందున ప్రభుత్వం నిధులు విడుదల చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

– కేతినేని ఇందు, సర్పంచ్, మోటమర్రి

బాధితులకు అండగా సీఎంఆర్ఎఫ్



సత్తుపల్లి: సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోని 60 మంది లబ్ధిదారులకు రూ.32.67 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గంలో 2019 నుంచి ఇప్పటి వరకు 4,250 మందికి రూ.23 కోట్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని సంక్షేమ రంగాలపై కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా వివక్షత చూపుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం రూ.10వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించిందన్నారు. ఈ నెల 24న సత్తుపల్లిలో సిటీ లైబ్రరీ నిర్మాణ శంకుస్థాపనకు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, వైస్ చైర్మన్ తోట సుజలరాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఎస్‌కె రఫీ, మల్లూరు అంకమరాజు, చల్లగుండ్ల కృష్ణయ్య, గ్రాండ్ మౌలాలీ, మధు, అబ్దుల్లా, నాగుల్‌మీరా, దొడ్డా శంకర్‌రావు, వీరపనేని రాధిక, కంచర్ల నాగయ్య, పెద్దిరాజు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

కొణిజర్ల: సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో కొణిజర్ల మండలంలోని పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. మల్లుపల్లికి చెందిన ధర్మసోత్ సౌందర్యకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.29,500 వేలు, రామనర్సయ్యనగర్‌కు చెందిన రేపాల శిరీషకు రూ.16,000 వేలను అందజేశారు. జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి ధర్మసోత్ సౌందర్య, తేజావత్ గోపాల్, కోటేష్, రాములు, రవి, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్

ఏన్కూరు: అన్ని వర్గాల ప్రజలకు అండగా, తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన ముందుకు పోతుందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. మండలంలోని తూతక లింగన్నపేట, బురదరాఘవాపురం, ఎర్రబొడుతండ, తిమ్మారావుపేట, రాయమాదారంలో గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. కులమతాలకు అతీతంగా కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బానోత్ సురేష్ నాయక్, భూక్య లాలు, మేడ ధర్మారావు, పూర్ణకంటి మైసారావు, భూక్య కాంతి, బాలాజీ నాయక్, బానోత్ వీరభద్రం, బానోత్ కృష్ణప్రియ, శ్రీకాంత్, ఆరెం సుహాసిని, భూక్య జగ్యా, ముక్తి లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నియంత్రణపై దృష్టి



సదస్సును ప్రారంభిస్తున్న ఎంపీపీ లలిత

మధిర: సమాజానికి ముప్పుగా పరిణమించిన మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ శారదాశాంతి, ఎంపీపీ లలిత అన్నారు. ఐసీడీఎస్, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన మధిరలోని రైతువేదికలో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో సీడీపీఓ, ఎంపీపీ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ల వద్ద సమాజానికి సంబంధించిన సమాచారం అందుబాటులో ఉన్నందున మానవ అక్రమ రవాణా జరగకుండా దృష్టి సారించాలని సూచించారు. ప్రజ్వల సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. తమ సంస్థ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా గత 27ఏళ్లుగా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పోరాడుతోందని తెలిపారు. ప్రజ్వల ప్రతినిధులు శ్రావ్య, చెన్నయ్య, సూపర్‌వైజర్లు మాలతీకుమారి, సరిత, శశి, సుజాతకుమారి, రమణ, జ్యోతిలక్ష్మి, నాగసత్యవతి, అన్నపూర్ణ, సరిత, బైజాన్ బీ, సుజాత పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపుపై విచారణ జరపాలి



దీక్ష శిబిరంలో పాల్గొన్న నాయకులు, స్థానికులు

కల్లూరు: కల్లూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా జరగలేదని.. ఇకనైనా పేదలకు న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ దీక్షలో పలువురు లబ్ధిదారులు పాల్గొనగా, ఆయన మాట్లాడుతూ ముందు రాసుకొచ్చిన చీటీలను తీసుకొచ్చి డ్రా పేరిట మోసం చేశారని మండిపడ్డారు. లబ్ధిదారులకు న్యాయం జరిగేలా మళ్లీ డ్రా తీయడమే కాక, ఆక్రమణకు గురైన ఎన్నెస్పీ భూమిని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ లక్కిరెడ్డి గోపిరెడ్డి, నాయకులు దామాల రాజు, భూక్యా శివకుమార్, జానీపాషా, షేక్ బాజీ, కర్నాటి వెంకటరెడ్డి, తేళ్లూరి లాలయ్య, ఎక్కిరాల పిచ్చయ్య, కంభం నాగేశ్వరరావు, గుగులోత్ సీతారాములు, ఉమామహేశ్వరి, జమీల, రమాదేవి, కోటేశ్వరి పాల్గొన్నారు.

అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తాం..



కల్లూరు: సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్/కల్లూరు: ప్రజా సమస్యల సాధన కోసం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో నిరంతరం అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తామని ఆ పార్టీ మండల కార్యదర్శి గంటా శ్రీనివాసరావు, ప్రజాపంథా జిల్లా నాయకుడు ఎ.వెంకన్న తెలిపారు. ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం సత్తుపల్లిలోని స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో, కల్లూరులో ఘనంగా నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి అయిందన్నారు. కార్మిక వర్గానికి అండగా ఉంటూ.. కార్మిక రాజ్యం స్థాపన కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శరత్, నాగిరెడ్డి, వెంకటేష్, నారాయణ, విశ్వనాథం, రాఘవులు, కేశవరావు, సత్యం, పట్టణ కార్యదర్శి జె మాల్యాద్రి, ఖమ్మంపాటి పుల్లారావు, జె పరిమళ, ఎ సరోజిని, జానీ, గౌస్, అంబులయ్య, వెంకటేశ్వర్లు, మంగన్న, బి సత్యం తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త మృతిపై సంతాపం



వెచ్చా జగన్ (ఫైల్)

వైరా: వైరాకు చెందిన ప్రముఖ వ్యాపారి, శ్రీ హరిహర సుత అయ్యప్ప క్షేత్రం ధర్మకర్తల మండలి సభ్యుడు వెచ్చా జగన్(68) మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు. ఆయన బుధవారం గుండెపోటుతో మృతి చెందగా వ్యాపారులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పలువురు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మా రోశయ్య, సర్పంచ్ ఇటుకల మురళి తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

కాటంనేని నాగయ్యకు పలువురి నివాళి

కల్లూరు రూరల్: కల్లూరు ఏఎంసీ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరావు తండ్రి కాటంనేని నాగయ్యకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరావు నివాళి అర్పించారు. బుధవారం చంద్రుపట్లలో జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని నాగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ అద్దె బస్సుల డ్రైవర్ల యూనియన్ ఎన్నిక



మాట్లాడుతున్న కొలికపోగు సర్వేశ్వరరావు

సత్తుపల్లి: సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రైవేట్ అద్దె బస్సుల డ్రైవర్ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కొలికపోగు సర్వేశ్వరరావు, అధ్యక్షుడిగా జోగేందర్ రావు, కార్యదర్శి సీహెచ్ రవి, కోశాధికారి వినయ్, సహాయ కార్యదర్శిగా మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా అక్రంలను ఎన్నుకున్నారు. కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని సర్వేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, అజయ్, కృష్ణ, తిరుపతిరావు, నాగరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తల్లాడ: స్థానిక హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం 20 వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీనివాసమూర్తి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ వేడుకలను వేంకటేశ్వర కల్యాణ మండపంలో వైభవంగా నిర్వహించారు. తిరుపతి వేద విశ్వ విద్యాలయం అధ్యాపకులు రొంపిచర్ల వెంకటసత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకుడు దివి సీతారామాచార్యులు, పరాంకుశం వికనసాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సామాజిక సేవకురాలికి అవార్డు



పద్మను సన్మానిస్తున్న నిర్వాహకులు

తల్లాడ: మండలంలోని నారాయణపురానికి చెందిన సామాజిక సేవకురాలు గొల్లమందల పద్మకు ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో తాజాగా జరిగిన కార్యక్రమంలో ఆమెకు అవార్డు అందజేసి సన్మానించారు. కాగా, పద్మను మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం అభినందించారు.

ఇంటివద్దకే తపాలా పథకాలు

మధిర: తపాల శాఖ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మధిర సబ్ డివిజన్ పోస్టల్ అధికారి వి.బాజీబాబు కోరారు. మధిర పోస్టాఫీస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టాఫీస్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఆన్‌లైన్లో వివరాలు నమోదు చేస్తే తమ సిబ్బంది ఇంటికి వచ్చి ఖాతా తెరిపిస్తారన్నారు. అలాగే, సేవింగ్ ఖాతా కలిగిన వారికి ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురితో ఆయన ఖాతాలు తెరిపించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

తపస్సుకాల దీక్షలు ప్రారంభం



దీక్ష స్వీకరిస్తున్న క్రైస్తవులు

కల్లూరు: కల్లూరులోని పలు చర్చీల్లో తపస్సుకాల దీక్షలు బుధవారం ప్రారంభమైయ్యాయి. కల్లూరు విచారణ పునీత చిన్న తెరేసమ్మ కతోలిక దేవాలయంలో విచారణ గురువులు రెవ. ఫాదర్ విన్సెంట్, ఓసీడీ రెవ. ఫాదర్ లూర్దురాజ్, రెవ. ఫాదర్ దేవదాస్ పలువురు భక్తులకు దీక్షాధారణ చేశారు. తొలుత దివ్యబలిపూజ జరిపారు. ఈ సందర్భంగా విచారణ గురువులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బక్తి శ్రద్ధలతో ఉండాలని ఉపవాసం, ప్రార్థన, ధానదర్మాలు చేయాలని తెలిపారు. ఈ 40 రోజుల శ్రమల కాలము పవిత్ర కాలంగా, అనుగ్రహ కాలంగా, రక్షణ కాలంగా స్వీకరించి పరిశుద్ధతో జీవించాలన్నారు.

పరిహారం పూర్తిగా చెల్లించాలి

కల్లూరు రూరల్: గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన తమకు వెంటనే పూర్తి పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ఈసందర్భంగా రైతు మద్దినేని లోకేశ్వరరావు బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండలంలోని పాయపూర్ – ఎర్రబోయినపల్లి రెవెన్యూ పరిధిలో లోకేశ్వరావుకు 2.05 ఎకరాల భూమి ఉండగా, ఇందులో 1.17 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. అయితే, అధికారులు 8 కుంటల భూమి సేకరించలేదని చెబుతూ తక్కువ పరిహారం ఇస్తామని చెబుతున్నారని వాపోయారు. ఇంకా తనకు రూ.4.80లక్షలు పరిహారం రావాల్సి ఉందని, తన పక్కనే భూమి ఉన్న పలువురికి అదనంగా పరిహారం చెల్లించారని తెలిపారు. ఇకనైనా అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని లోకేశ్వరరావు కోరారు.

అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ

సత్తుపల్లిరూరల్: అంగన్‌వాడీల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.కొండమ్మ అన్నారు. బుధవారం మండలంలోని సిద్ధారంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న ఆహారం, హాజరు పట్టిక, గుడ్లు, పాలు తదితర విషయాలను టీచర్ మరియమ్మను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలింతలు, గర్భిణుల వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వెంకటనర్సమ్మ, ఏఎన్ఎం శాంతకుమారి ఉన్నారు.

బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన రైతు పోలంపల్లి శ్రీనివాసరావు ఇటీవల మృతిచెందారు. ఈయన పేరిట అయ్యావారిగూడెం సొసైటీలో గ్రూపు ఇన్సూరెన్స్ చేయించారు. బుధవారం మండలకేంద్రంలోని కోఆపరేటివ్ బ్యాంకులో మృతుని పేరిట మంజూరైన రూ.50 వేల నగదును ఆయన భార్య విజయలక్ష్మికి సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ మహేష్, సొసైటీ సీఈఓ మొహన్‌రావు, సిబ్బంది మురళీ, రమణారెడ్డి, తదితరులున్నారు.

22ఎండిఆర్64 ఎర్రుపాలెంలో బీమా నగదు అందజేస్తున్న చైర్మన్ సాంబశివరావు

మృతుడి కుటుంబానికి బియ్యం వితరణ

కారేపల్లి: మండలంలోని పాతకమలాపురం గ్రామానికి చెందిన భూక్యా రామ్లా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా.. బాధిత కుటుంబానికి కారేపల్లి మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు పాండ్యానాయక్ ఆధ్వర్యంలో 50కేజీల బియ్యాన్ని బుధవారం వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాల్, నాయకులు అజ్మీర వీరన్న, సర్పంచ్ గుగులోతు పద్మామంగ్యానాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ



మేకలకు మందు వేస్తున్న సర్పంచ్ సంధ్యారాణి

మధిర: మండలంలోని చిలుకూరు గ్రామంలో మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన జీవాలలో నట్టల నివారణ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నిడమానూరు సంధ్యారాణి ప్రారంభించారు. ఈ శిబిరంలో గొర్రెల పెంపకం దారులను ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ.. తమ జీవాల ఎదుగుదలకు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని కోరారు. ఈ శిబిరంలో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ లక్ష్మణరావు, సిబ్బంది, గ్రామ పెద్దలు వంశీ, గొర్రెల పెంపకం దారులు శ్రీను, కష్ణ, చిన్ని, పాల్గొన్నారు.

ముదిగొండ: ముదిగొండలో బుధవారం నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ సామినేని హరిప్రసాద్ ప్రారంభించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు సిబ్బంది మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దామోదర్, ఉపసర్పంచ్ శ్రీను, చింతలచెర్వు లక్ష్మి, పశువైద్యాధికారి అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.